ఉచిత వైద్య శిబిరం



రక్తదాన శిబిరంలో
ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నేతలు

అల్వాల్‌: బీజేపీ సేవా పక్షంలో భాగంగా వెంకటాపురం డివిజన్‌ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కానాజీగూడలో రక్తదాన శిబిరం, ఉచిత కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు మాణిక్యంరెడ్డి, మురళీకృష్ణ, భాను ప్రకాష్, నిఖిల్, రవికిరణ్, ఆంజనేయులు, రఘుపతిరెడ్డి, రాజ్‌కుమార్, సుజాత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌: ఉప్పల్‌ డివిజన్‌ స్వరూప్‌నగర్, పద్మావతికాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి స్థానిక కాలనీ సంఘాలు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్య, ధ్వంసమైన రోడ్లు తదితర అంశాలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్‌ ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, ఈఈ హరిలాల్, జలమండలి మేనేజర్‌ సత్యనారాయణ, కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మౌలాలి: వికలాంగులకు పెన్షన్‌ పెంచుతామని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వినయ్‌ కోరారు. ఈ మేరకు శనివారం వినాయకనగర్‌ కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పెన్షన్‌ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని కోరారు. హరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

'గ్లామర్‌ ఎక్స్‌' బైక్‌ ఆవిష్కరణ



మల్కాజిగిరి: సాయినగర్‌లో హీరో షోరూమ్‌లో శుక్రవారం గ్లామర్‌ ఎక్స్‌ నూతన మోడల్‌ బైక్‌ను మల్కాజిగిరి సర్కిల్‌ ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ మంజుల ఆవిష్కరించారు. షోరూమ్‌ ప్రొప్రైటర్‌ నవీన్‌కుమార్‌యాదవ్‌ మాట్లాడుతూ.. గ్లామర్‌ బైక్‌ విజయవంతమైందని కొత్త మోడల్‌ యువతను ఆకట్టుకుంటుందన్నారు.

మద్యం విక్రయాలపై ఫిర్యాదు

మద్యం సేవించి కొట్టుకున్న మందుబాబులు



ఇన్‌స్పెక్టర్‌ ధనుంజయకు ఫిర్యాదు చేస్తున్న అపార్ట్‌మెంట్‌వాసులు

మల్లాపూర్‌: గోకుల్‌నగర్‌ వెళ్లే దారిలో రోడ్డుకు ఆనుకుని ఉన్న వైష్ణోదేవీ బార్‌అండ్‌ రెస్టారెంట్‌లో కిచెన్‌రూమ్‌ నుంచి తెల్లవారుజామున మద్యం జోరుగా అమ్ముతున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని శనివారం నాచారం ఇన్‌స్పెక్టర్‌ ధనుంజయకు గుల్మోర్‌ గార్డెన్‌ అపార్ట్‌మెంట్‌ వాసులు ఫిర్యాదు చేశారు.

తెల్లవారు జాము వరకు విక్రయాలు..

శనివారం తెల్లవారు జామున మందుబాబుల మధ్య తీవ్ర వాగ్వాదం గొడవకు దారి తీసింది. దీంతో భయాందోళనలకు గురైనా కాలనీవాసులు నాచారం, ఎక్సైజ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లైట్లు బంద్‌ చేసి..

వీధి లైట్లు బంద్‌ చేసి బ్లాక్‌లో మద్యం అమ్ముతున్నారని, న్యూసెన్స్‌ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిష్కారమేది ?



కుషాయిగూడ డీ మార్ట్‌ వద్ద దెబ్బతిన్న రోడ్డు

గతుకుల రోడ్లతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

- గత్యంతరం లేక బురద రోడ్లపైనే ప్రయాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కాప్రా: గుంతల రోడ్లతో కాప్రా సర్కిల్‌ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల రోడ్లు మరమ్మతులకు గురై ఇప్పటికే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. సర్కిల్‌ పరిధిలో పలుచోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దారి మళ్లింపులు చేపట్టారు. ప్రయాణికులకు సరైన ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

❖ ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్‌లో బాక్స్‌డ్రైయిన్‌ పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన రోడ్డు మార్గంలోనే వెళ్తుండటంతో ఆ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ప్రత్యామ్నాయ మార్గాలు మరింత దారుణంగా ఉండటంతో ప్రయాణికులు, స్థానిక పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్లన్నీ గుంతలమయం..

ఏఎస్‌రావునగర్ పద్మశాలీటౌన్‌షిప్ ఓక్‌వ్యాలీ స్కూల్‌ సమీపంలో బాక్స్‌ డ్రైన్‌ పనులు కొనసాగుతున్నాయి. దీంతో కుషాయిగూడ, చక్రీపురం నుంచి పద్మశాలీ టౌన్‌షిప్, దమ్మాయిగూడ వెళ్లే వాహనాలు దారి మళ్లించారు. మళ్లించిన మార్గం మట్టి రోడ్డు, గుంతలు, ఆపై బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు నరకం అనుభవిస్తున్నారు.

❖ అభివృద్ధి పనుల కోసం దారి మళ్లించి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా వదిలేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మార్గంలో తప్పని పరిస్థితుల్లో చుట్టూ తిరిగి వెళ్తున్నారు. బురదతో పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురద, గుంతల రోడ్లపై ప్రయాణం సాగిస్తూ.. ప్రమాదాల భారిన పడుతున్నామని వాహనదారులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాగార్జుననగర్ కాలనీలో నరకం..

కుషాయిగూడ డీమార్ట్ సమీపంలో బాక్స్‌డ్రైన్‌ పనులు కొనసాగుతుండటంతో ఆ మార్గాన్ని మూసివేశారు. ప్రత్యామ్నాయ మార్గం చూపడంలో సంబంధిత అధికారులు అలసత్వమే వహించారు. డీమార్ట్‌ రోడ్డును మూసివేశారు. ప్రత్యామ్నాయ మార్గం రోడ్డు నెంబర్‌ -1లో ఉంది. కానీ ఈ రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మరమ్మతులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

❖ భవానీనగర్‌ వద్ద రోడ్డు మరమ్మతులకు గురై స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు అనేక సార్లు అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రజా ప్రతినిధులను కలిసినా కూడా సమస్యకు పరిష్కారం దొరకడం లేదని వాపోతున్నారు.



కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అలసత్వమెవరిదో అర్థం కావడం లేదు ?



కాప్రా సర్కిల్‌లో చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా మారి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య తాజాగా ఏర్పడింది కాదు. నెలల తరబడి నెలకొంది. సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడానికి అధికారుల అలసత్వమో.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమా.. ? అనేది అర్థం కావడం లేదు.

– సంజీవరెడ్డి, కాప్రా కాలనీల కో– ఆర్డినేషన్‌ కమిటీ ప్రెసిడెంట్‌

మొక్కుబడిగా పనులు



గుంతల రోడ్లపై ప్రయాణంతో నిత్యం ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. అక్కడక్కడ మొక్కుబడిగా ప్యాచ్‌ వర్క్స్‌ పేరుతో చేసి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్ల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించడం లేదు.

– పద్మారెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రెసిడెంట్‌

పట్టించుకునే నాథుడే కరువయ్యారు



భవానీనగర్‌ కమాన్‌ వద్ద రోడ్డు మరమ్మతులకు గురై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లపై నిలుస్తున్న నీటిని చూస్తే చెరువులను తలపిస్తున్నాయి. రోడ్ల సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఎందుకు..? స్పందించడం లేదో అర్థం కావడం లేదు.

– సీహెచ్‌.నరసింహ, భవానీనగర్‌

స్వయం ఉపాధి మహిళలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మహిళలకు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే

మల్కాజిగిరి: మహిళలు స్వయం ఉపాధిని పొందడానికి తగిన సహకారం అందిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సర్దార్‌పటేల్‌నగర్‌ ప్రాంతానికి చెందిన మహిళల స్వయం ఉపాధికి సుమారు రూ.2.5 లక్షలు విరాళంగా అందజేశారు. మాజీ కార్పొరేటర్‌ జగదీష్‌గౌడ్‌ మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యే మహిళాశక్తి భవన్‌ను పరిశీలించినప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్యే అందజేసిన నిధులతో 10 కుట్టుమిషన్లు, రెండు పీకో మిషన్లు, రెండు కటింగ్‌ టేబుల్స్, 50 చైర్లు, మీటింగ్‌ టేబుల్, అల్మారాలు కొనుగోలు చేస్తామని త్వరలోనే కుట్టు శిక్షణా తరగతులు ప్రారంభిస్తామన్నారు. చంద్రకళ, ప్రేమలత, తార, లక్ష్మి, లలిత, వెంకన్న, జనార్దన్, నవీన్‌ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

బోడుప్పల్‌: 1వ డివిజన్‌ పరిధిలోని ద్వారకానగర్‌ ఫేస్‌– 1లో సీసీరోడ్డు పనులకు మాజీ కార్పొరేటర్‌ బింగి జంగయ్యయాదవ్‌ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా డివిజన్‌ పరిధిలో తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌ తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఏఎస్‌రావును ఆదర్శంగా తీసుకోవాలి



ఈసీనగర్‌లో నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విగ్రహావిష్కరణలో అనురాగ్‌కుమార్‌ తదితరులు

కుషాయిగూడ: ఎలక్ట్రానిక్స్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఈసీఐఎల్‌) వ్యవస్థాపకుడు పద్మ భూషన్‌ డాక్టర్‌ ఏఎస్‌రావు 111వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసీఐఎల్‌ కంపెనీ ఆవరణలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఏఎస్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు, వెంకట్‌రాంరెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, కుమారస్వామి, రహీం, అల్వా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాప్రా: డాక్టర్‌ ఏఎస్‌రావును నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఈసీఐఎల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ అనురాగ్‌కుమార్‌ పిలుపునిచ్చారు. ఈసీఐఎల్‌ వ్యవస్థాపకుడు, అణుశాస్త్రవేత్త డాక్టర్‌ ఏఎస్‌రావు(అయ్యగారి సాంబశివరావు) 111వ జయంతి సందర్భంగా ఏఎస్‌రావునగర్‌లో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏఎస్‌రావు ఆశయాలకు అనుగుణంగా విద్యారంగంలో ఆయన పేరుపై ఉన్న పురస్కార మండలి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సైన్స్‌ మ్యూజియానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రామంతాపూర్‌: ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిశారు. శనివారం డివిజన్‌ పరిధిలోని ఓయూ క్యాంపస్‌ బస్తీల ప్రజలు రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వర్షం కురిస్తే వరద నీరు ఇళ్లలోకి చేరుతోందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి సీఎం నిధులను కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి అతి త్వరలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి, హబ్సిగూడ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్రనాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుంటూరు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బార్‌కు అనుమతి ఇవ్వొద్దని ధర్నా



ధర్నా చేస్తున్న మహిళలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుషాయిగూడ: తమ కాలనీల్లో బార్‌కు అనుమతి ఇవ్వొద్దంటూ.. కాలనీల మహిళలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్, వేంకటేశ్వరనగర్ కాలనీల మెయిన్‌ రోడ్డులో బార్‌ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న రెండు కాలనీల మహిళలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శనివారం ధర్నాకు దిగారు. ఇప్పటికే ఉన్న బార్‌తో ఇబ్బందులు పడుతుంటే మరో బార్‌ ఏర్పాటుకు అనుమతి ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్‌ అధికారులు స్పందించి బార్‌ అనుమతిని నిలిపివేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తిరుమలనగర్‌ కాలనీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, వెంకటేశ్వరనగర్‌ కాలనీ అధ్యక్షుడు శ్రీపతి, భాగ్యమ్మ, జ్యోతి, భారతి, బాల్‌రెడ్డి, కొమురయ్య, నర్సయ్య, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతతో ముంపు సమస్యకు పరిష్కారం



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌

మల్కాజిగిరి: ఆకస్మిక వర్షాలతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారని ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ ఇంజినీరింగ్‌ అధికారులకు సూచించారు. శనివారం సీఫెల్‌ కాలనీ, రాంచంద్ర ఎన్‌క్లేవ్‌ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలతో బండచెరువులోని నీరు క్రింది ప్రాంతంలోని కాలనీల్లోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలాల్లో పూడికతీయడం, అవసరమైన చోట నాలా విస్తరణ, నాలా ఎత్తు పెంపు రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంతో ముంపు సమస్య తీరుతుందని, ఆ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మి, మేనేజర్‌ నవీన్, నాయకులు సత్యమూర్తి, సత్యనారాయణ, బాబు, కిషోర్, హరీష్, మూర్తి, మారుతీరావు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో కొనసాగుతున్న ఎస్‌ఎన్‌డీపీ, పోచమ్మకుంట రోడ్డు పనులను శనివారం హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి పీర్జాదిగూడ మాజీ మేయర్‌ అమర్‌సింగ్‌ తనిఖీలు చేశారు. ఎస్‌ఎన్‌డీపీ పనులపై స్థానికుల నుంచి అభిప్రాయాలను సేకరించి, పనుల్లో నాణ్యత, పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను గుర్తించి తక్షణమే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బొడిగె కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్‌ సుభాష్‌నాయక్, వీరాంజనేయ ఆలయ చైర్మన్‌ రాంరెడ్డి, కాలనీవాసులు, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా..

మల్లాపూర్‌: మెరుగైనా ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, చిన్నారులకు ఆరోగ్య సంరక్షణ కల్పించడమే లక్ష్యంగా 'స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్‌ అభియాన్‌' కార్యక్రమాన్ని చేపట్టినట్లు మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్‌ సూర్యనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆరోగ్య పరీక్షలు, గర్భాశయ కేన్సర్, రొమ్ము కేన్సర్, కంటి, దంత పరీక్షలు నిర్వహిస్తారు. డాక్టర్లు ధరణిరెడ్డి, కిరణ్‌కుమార్, ప్రీతి, మాధవి, ఆసుపత్రి సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు అండగా ఉంటాం



గౌతంనగర్‌: పేద బ్రాహ్మణులకు అండగా ఉంటామని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు శేషం రఘుకిరణాచార్యులు అన్నారు. శనివారం గౌతంనగర్‌ డివిజన్‌ మహేంద్రహిల్స్‌ శ్రీజయగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆయన బ్రాహ్మణ సేవా వాహిని కమిటీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు రాజేశ్వర్, వెంకటేశ్వరశర్మ, శ్రీకర్, కేశవ్, సందీప్, రాఘవ, ప్రవీణ్, మధు, పవన్, వంశీ, రాజశేఖర్, ప్రభ, సునీత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కార్పొరేటర్‌ పాదయాత్ర

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ వెంకటరావుపేటలో శనివారం కార్పొరేటర్‌ చింతల శాంతిశ్రీనివాస్‌ రెడ్డి సమస్యలపై అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీలో బోర్‌వెల్, రోడ్డు, కొమ్మలు తీయడం, మురుగునీటి పారుదల అడ్డంకి తదితర సమస్యలను గుర్తించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. ఏఈ వరుణ్, జలమండలి అధికారి శేఖర్, రాజు, రామానుజం, అమూల్, ముత్తులక్ష్మి, వాణి, సాగర్, ప్రేమ్, సాజిద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



కృష్ణారెడ్డినగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో శనివారం ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. మీర్‌పేట్‌–హెచ్‌బీ కాలనీ, చర్లపల్లి డివిజన్లలో కార్పొరేటర్‌ ప్రభుదాస్, వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. చర్లపల్లి డివిజన్‌ పరిధిలోని సాయినగర్, కృష్ణారెడ్డినగర్, నాగార్జుననగర్, శివసాయినగర్, మీనాక్షినగర్, లక్ష్మీనర్సింహ్మాకాలనీల్లో పర్యటించిన ఆయన పొంగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలన్నారు. సాయినగర్‌ నుంచి వస్తున్న వరద నీటితో కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద వాహనదారులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించినట్లు వివరించారు. అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ నుంచి సాఫీగా నాగారం చెరువులోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హెచ్‌బీకాలనీలోని లక్ష్మీనగర్, ఇందిరానగర్‌ కాలనీలో పర్యటించారు. వర్షం కురిసినప్పుడల్లా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జలమండలి జనరల్‌ మేనేజర్‌ సంతోష్‌కుమార్‌కు వివరించి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా కార్యచరణ చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌గౌడ్, ప్రవీణ్, శేఖర్‌నాయక్, సారా వినోద్, శ్రీధర్‌రెడ్డి, రవిప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ పెంచాలని ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో ధర్నా



కార్పొరేటర్‌ శాంతికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్‌ నేతలు

మల్లాపూర్‌: దివ్యాంగులకు పెన్షన్‌ రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, కండరాల బలహీనత వారికి రూ.15 వేల పెన్షన్‌ పెంచాలని శనివారం నాచారం వార్డు కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్‌ మహాధర్నా చేపట్టారు. అనంతరం నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర నేత కేశవులు, ఉప్పల్‌ కో– ఆర్డినేటర్‌ నాగరాజు, మూర్తి, నాగరాజు, యోగేష్, సునీల్, అనిల్, సుమన్, సైదులు, కిషన్‌ సోమయ్య, శేఖర్‌ తదితరులున్నారు.

కాప్రా చెరువును సందర్శించిన జెడ్సీ



కాప్రా చెరువు వద్ద జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌

కాప్రా: గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఎల్బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ కాప్రా డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం కాప్రా చెరువును పరిశీలించి, జలకళ సంతరించుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం అశోక్‌మణిపురి కాలనీకి చేరుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షానికి ఇళ్లల్లోకి వరదనీరు చేరుతుందని, సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ శివమణి సమస్య గురించి వివరించారు. వరదనీటి మళ్లింపునకు ఇప్పటికే రూ.9 లక్షలు మంజూరు చేశామని, సమస్య పరిష్కారానికి మరిన్ని నిధులు కూడా మంజూరు చేస్తామని జెడ్సీ హామీ ఇచ్చారు. కాప్రా సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ జగన్, ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ నాగేందర్, అధికారులు కృష్ణమోహన్, సురేష్, సుదర్శన్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

జెడ్‌పీహెచ్‌ఎస్‌లో 'స్వచ్ఛతా హి సేవ'



బహుమతులు ప్రదానం చేస్తున్న కమిషనర్‌ శైలజ

బోడుప్పల్‌: ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ హి సేవ కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్వచ్ఛతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు కమిషనర్‌ శైలజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన జీవనానికి కృషి చేద్దామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్‌: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 28వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ చీరాల నర్సింహ్మా అన్నారు. పెంటారెడ్డి కాలనీలోని వీధి నెంబర్‌– 2, ఎస్సీబస్తీలో శనివారం చేపట్టిన ప్యాచ్‌ వర్క్స్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు. పెంటారెడ్డి కాలనీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకయ్య, ఉపాధ్యక్షులు చంద్రయ్య, ప్రసాద్, రూపేష్, సుధీర్, సురేష్‌ కుమార్, నవీన్, లక్ష్మి పాల్గొన్నారు.

